
# రొనాల్డో మరో ఘనత



రియాద్: ఆధునిక సాకర్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన పేరిట మరో ఘనతను లిఖించుకున్నాడు. సౌదీ ప్రో లీగ్‌లో అల్ నసర్ తరపున ఆడుతున్న ఈ పోర్చుగల్ వీరుడు.. ఫైనల్‌లో అల్ హిలాల్‌పై ఒక గోల్ చేయడంతో సీజన్‌లో అతడి మొత్తం గోల్స్ సంఖ్య 35కు చేరింది. దీంతో ఒక సీజన్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా రొనాల్డో రికార్డులకెక్కాడు. గతంలో ఈ రికార్డు హమ్దల్లా (2019 సీజన్‌లో 34 గోల్స్) పేరిట ఉండేది. లీగ్స్‌లో ఆడుతూ అత్యధిక గోల్స్ చేసిన రికార్డు (893) రొనాల్డోదే. కానీ అతడు రికార్డు గోల్స్ చేసినా సౌదీ ప్రో లీగ్‌లో అల్ నసర్ మాత్రం రెండో స్థానంలో నిలిచింది. సీజన్ ఆసాంతం ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా ఆడిన అల్ హిలాల్ విజేతగా నిలిచింది.

# హెడ్‌కోచ్ రేసులో మోదీ, అమిత్‌షా, సచిన్!





ముంబై: భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ఈ జూన్‌తో ముగియనున్న నేపథ్యంలో కొత్త కోచ్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇటీవలే దరఖాస్తులు కోరగా.. ఆ పోస్టుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ, వీరేంద్ర సెహ్వాగ్ పేర్లతో అప్లికేషన్లు వచ్చాయి. కొంతమంది ఆకతాయిలు వీళ్ల పేర్లతో బీసీసీఐకి 'ఫేక్ అప్లికేషన్లు' పంపించినట్టు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనంలో పేర్కొంది. టీమ్ఇండియా హెడ్‌కోచ్ కోసం ఇప్పటి దాకా సుమారు 3 వేల దరఖాస్తులు రాగా అందులో 95 శాతం ఇలాంటివేనని అందులో పేర్కొంది. హెడ్‌కోచ్ రేసులో మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

## రెండు నిమిషాల్లోనే..



బ్యాంకాక్: బాక్సింగ్ ప్రపంచ క్వాలిఫయర్స్‌లో భారత యువ బాక్సర్ నిషాంత్ దేవ్ రెండో రౌండ్‌ను రెండంటే రెండే నిమిషాల్లోనే పూర్తిచేసి ప్రత్యర్థిని మట్టికరిపించాడు. మంగళవారం జరిగిన 71 కిలోల రెండో రౌండ్ పోరులో నిషాంత్.. ఆట మొదలవగానే మంగోలియా బాక్సర్ బయంబ ఎర్డెనెటొపై పవర్‌ఫుల్ పంచ్‌లతో దాడికి దిగాడు. నిషాంత్ పంచ్‌లకు తాళలేకపోయిన ఎర్డెనెటొ.. రిఫరీ స్టాప్ ది కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ)తో రింగ్‌ను వీడటంతో భారత బాక్సర్ విజేతగా నిలిచి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. మరో మ్యాచ్‌లో అవినాశ్ జమ్వల్ (63.5 కిలోలు).. కొలంబియా బాక్సర్ జోస్ మాన్యూల్ చేతిలో ఓడి తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు. 57కిలోల కేటగిరీలో సచిన్ సివాచ్ 5-0తో ఫ్రెడ్రిక్ జెన్సన్(డెన్మార్క్)పై గెలిచి టోర్నీలో ముందంజ వేశాడు.

## ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో అనుమతివ్వండి


### హైకోర్టుకు తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) జరుగబోయే ఎన్నికల్లో తమ ప్రాతినిధులను అనుమతించకపోవడంపై తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ నెల 25న జారీ చేసిన ఎన్నికల ప్రొసీడింగ్స్‌లో రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులను తొలిగించిందని పిటీషనర్ కార్యదర్శి శ్రీవాసు అన్నారు. క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్‌ను తప్పించడం అన్యాయమన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి స్క్వాష్ పోటీల్లో పాల్గొనే సంస్థల గుర్తింపునకు తమ అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ఐవోఏ ఎన్నికల్లో పాల్గొనేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. దీనిపై ఈ నెల 30న విచారణ జరిగే అవకాశం ఉంది.

# బేస్‌బాల్ అడ్డాలో క్రికెట్ ఫీవర్

## యూఎస్‌ఎలో క్రికెట్‌కు ఆదరణ దక్కేనా?.. ఆశలపల్లకిలో ఐసీసీ







*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*


*భారత్‌లో క్రికెట్ అంటే ఓ మతం. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని నెలకొల్పిన బ్రిటన్ ఏలిన కామన్వెల్త్ దేశాల్లోని క్రికెట్ ఆడే దేశాల్లో ఈ ఆటకు మంచి ఆదరణే ఉంది. ఇక్కడ ఏ టోర్నీలు జరిగినా ఫుల్ క్రేజ్ ఉంటుంది. కానీ మరో నాలుగు రోజుల్లో మొదలుకాబోయే ఐసీసీ టీ20 వరల్డ్ కప్-2024కు ఓ ప్రత్యేకత ఉంది. క్రికెట్ అంటే అమితాభిమానం ఉన్న వెస్టిండీస్‌తో పాటు ఈ ఆటతో సంబంధమే లేని అమెరికా సంయుక్త రాష్ట్రాల (యూఎస్ఏ) వేదికగా 9వ పొట్టి ప్రపంచకప్ పోరు జరుగనుంది. బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ అంటే పడి చచ్చే అమెరికన్లు... క్రికెట్‌ను ఏ మేరకు ఆదరించగలరు?*

ప్రపంచాన్ని కనుసైగతో శాసిస్తున్న అమెరికాలో టీ20 వరల్డ్ కప్‌నకు జూన్ 2న తెరలేవనుంది. ఇప్పుడిప్పుడే యూఎస్‌ఎలో క్రికెట్ వ్యాప్తికి విశ్వప్రయత్నాలు చేస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ).. మెగా టోర్నీతో అగ్రరాజ్యంలో ఈ ఆటను మరింత ముందుకు తీసుకెళ్లే వ్యూహంతో సిద్ధమౌతోంది. అదీగాక 128 ఏండ్ల తర్వాత లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్ (2028)లో ఈ ఆటను తిరిగి విశ్వక్రీడల్లో ప్రవేశపెట్టేందుకూ పొట్టి పోరును విజయవంతంగా నిర్వహించడం ఐసీసీకి అత్యావశ్యకం. కానీ బేస్‌బాల్, నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్), నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) వంటి టోర్నీలు ఉంటే ప్రపంచంతో తమకేమీ పట్టనట్టు వ్యవహరించే యూఎస్‌ఎలో క్రికెట్‌ను ఎలా ఆదరిస్తారనేదే అసలు ప్రశ్న. గుండ్రటి బ్యాట్‌తో బేస్‌బాల్‌ను చూసిన అమెరికన్లు.. ఫ్లాట్ బ్యాట్‌తో ఆడే క్రికెట్‌ను అదే ఉత్సాహంతో చూడగలుగుతారా? ఈ ఆటలో 'పిచర్', 'సెకండ్ బేస్', 'షార్ట్ స్టాప్' వంటి ఫీల్డ్ పొజిషన్లను ఏండ్లుగా చూస్తున్న వారికి క్రికెట్‌లోని 'షార్ట్ థర్డ్ మెన్', 'ఫైన్ లెగ్', 'డీప్ మిడ్ వికెట్' అంటే అర్థమవుతుందా..?

❖ అమెరికాలో క్రికెట్‌ను సుమారు 3 కోట్ల మంది అభిమానులు వీక్షిస్తున్నారని, తాజా టోర్నీతో ఆ సంఖ్య రెట్టింపు అవుతుందని ఐసీసీ ఆశలు పెట్టుకుంది. ప్రపంచకప్ కంటే ముందే గతేడాది ఇక్కడే నిర్వహించిన మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టోర్నీ విజయవంతమవడం ఐసీసీ పట్టుదలను మరింత పెంచింది. టీ20 వరల్డ్‌కప్ బ్రాండ్ అంబాసిడర్‌గా జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్‌ను నియమించడం, అమెరికాలో హుటాహుటిన స్టేడియాల నిర్మాణం, క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడం వంటి పనులతో ఐసీసీ చేయగలిగినంత చేస్తోంది.

❖ వాస్తవానికి అమెరికాలో అభిమానులకు క్రికెట్ కొత్త అయినా ఆ దేశానికి మాత్రం కాదు. 18వ దశకం (బ్రిటన్ పాలనలో)లోనే అమెరికా క్రికెట్ ఆడింది. ఆ దేశ మొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ క్రికెట్‌కు వీరాభిమాని. 1844లోనే అమెరికాలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ (కెనడా వర్సెస్ సెయింట్ జార్జి క్రికెట్ క్లబ్) జరిగింది. అయితే బ్రిటన్, ఆస్ట్రేలియాలో క్రికెట్ వ్యాప్తితో ఆ దేశాలు ఆ ఆటమీద గుత్తాధిపత్యాన్ని సాధించిన నేపథ్యంలో అమెరికా ఈ ఆట నుంచి పక్కకు తప్పుకుని 1860 దశకం తర్వాత బేస్‌బాల్ వైపునకు మళ్లింది. అమెరికాలో క్రికెట్ వ్యాప్తి చేయడానికి టీ20 ప్రపంచకప్ ఏ మేరకు ఉపయోగపడ్డా కిందిస్థాయి నుంచి ప్రోత్సహించాలని విశ్లేషకుల వాదన. మరి ఐసీసీ ఉత్సాహం ఆదిలోనే ఆవిరికావొద్దన్నా, లాస్ ఏంజెల్స్ కలలు చెదిరిపోవొద్దన్నా టీ20 ప్రపంచకప్ సూపర్ సక్సెస్ అవడం ఐసీసీకి అత్యంత కీలకం.

**అమెరికాలో జరిగే మ్యాచ్‌లు: 16**
**(టోర్నీలో అత్యంత క్రేజ్ ఉన్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ కూడా ఇక్కడే జరుగనుంది)**







## టీమ్ఇండియాకు 'డబ్బావాలా'ల మద్దతు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో వేలాదిమంది 'బతుకు జీవుల' ఆకలి తీరుస్తున్న 'డబ్బావాలా'లు భారత క్రికెట్ జట్టుకు మద్దతుగా నిలిచారు. వెస్టిండీస్/యూఎస్ఏ వేదికలుగా మరో మూడు రోజుల్లో మొదలుకాబోయే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొననున్న రోహిత్ సేనకు మద్దతు తెలిపారు. మంగళవారం సుమారు వెయ్యి మంది డబ్బావాలాలు టీమ్ఇండియా జెర్సీలు ధరించి ప్రపంచకప్ కొట్టాలని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. ఈసారి భారత జట్టు బలంగా ఉందని, రోహిత్, విరాట్ తమ మ్యాజిక్‌తో పొట్టికప్పును దేశానికి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సబలెంక బోణీ


ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో బెలారస్ స్టార్ సబలెంక బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ సబలెంక 6-1, 6-2తో ఎరికా అండ్రీవా(రష్యా)పై అలవోక విజయాన్ని సొంతం చేసుకుంది. గంటా ఎనిమిది నిమిషాల పాటు సాగిన పోరులో సబలెంక తనదైన ఆధిపత్యం ప్రదర్శించింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకున్న సబలెంక..మాడ్రిడ్, రోమ్‌లో జరిగిన క్లే కోర్టు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో సబలెంక ఒక ఏస్ కొట్టగా, అండ్రీవా రెండింటికి పరిమితమైంది. సబలెంక(1)తో పోల్చుకుంటే అండ్రీవా నాలుగు సార్లు అనవసర తప్పిదాలకు పాల్పడి మ్యాచ్‌ను చేజార్చుకుంది. తన అనుభవాన్నంతా ఉపయోగించుకుంటూ అనామక ప్లేయర్‌పై గెలిచి సబలెంక రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. మరోవైపు ఎలీనా రిబకినా 6-2, 6-3తో గ్రీట్ మినెన్(బెల్జియం)పై గెలిచి టోర్నీలో శుభారంభం చేసింది. మిగతా మ్యాచ్‌ల్లో బ్లింకోవా, స్ట్రెర్న్స్, రస్, మెర్టెన్స్, మాట్రిచ్, జెంగ్, మాడిసన్ కీస్..ప్రత్యర్థులపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో మెద్వదెవ్ 6-3, 6-4, 5-7, 6-3తో కోఫెర్‌పై గెలువగా, మునార్ 6-1, 4-6, 6-4, 6-1తో బటిస్టాను ఓడించి తదుపరి రౌండ్‌లో నిలిచాడు.

## సాత్విక్-చిరాగ్ జోడీకి షాక్

సింగపూర్: భారత స్టార్ షట్లర్ జోడీ, ప్రపంచ నంబర్‌వన్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి సింగపూర్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 20-22, 18-21తో డెన్మార్క్ జంట డేనియల్ లుండ్‌గార్డ్-మ్యాడ్స్ వెస్ట్‌గార్డ్ చేతిలో పరాభవం పాలైంది. తొలిరోజు ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, ఉమెన్స్ డబుల్స్‌లో పాండా సిస్టర్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సూర్య-అమృత సైతం నిరాశపరిచారు.





Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.